ధర లేక రైతన్న దిగాలు!

- గణనీయంగా పెరిగిన పుచ్చకాయల సాగు
- డిమాండ్ లేక పడిపోయిన రేటు


హోతి(కె)గ్రామంలో సాగు చేస్తున్న పుచ్చకాయ పంట

జహీరాబాద్ టౌన్: పుచ్చకాయల ధరలు తగ్గడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. దిగుబడి గణనీయంగా పెరిగినా.. డిమాండ్ లేక ధరలు పతనమయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 6 నుంచి రూ.7 పలుకుతుంది. ధరలు పడిపోవడం వల్ల వేల రుపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టపోతున్నారు. వేసవికాలంలో వీటికి మంచి డిమాండ్ ఉంటుందని.. మంచి లాభాలు తెచ్చి పెడుతోందని, దశారుల బెడద ఉండదని రైతులు పుచ్చకాయల సాగుపై మొగ్గు చూపారు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పతనం కావడంతో రైతులు విలవిలలాడుతున్నారు.

వేసవిలో అధికంగా పుచ్చకాయ సాగుపై జిల్లాలోని పలు ప్రాంత రైతులు దృష్టి పెట్టారు. మంచి లాభాలు వస్తుండడంతో సాగుపై రైతులు ముందుకు వస్తున్నారు. ప్రతి సంవత్సరం పంట సాగు విస్తీర్ణం పెరుగుతుంది. 65 రోజుల నుంచి 70 రోజుల్లో పంటచేతికి వస్తుంది. ఈ ఎడాది జిల్లాలో సుమారు రూ.1500 ఎకరాల్లో పంట సాగువుతుంది. అనుకూల వాతావరణం ఉండడంతో జహీరాబాద్ ప్రాంత రైతులు కొన్ని సంవత్సరాల నుంచి పుచ్చకాయల పంటను సాగు చేస్తున్నారు. పంట దిగుబడి పెరగడంతో ప్రస్తుతం మార్కెట్‌లో ధర పడిపోయింది.

పండుగ సమయంలో పెరగని ధరలు

మహాశివరాత్రి, రంజాన్ పండగల్లో ధరలు పెరుగుతాయని రైతులు ఆశించారు. మహాశివరాత్రి పండగ అయిపోయింది. రంజాన్ మాసం ముగియడానికి వచ్చింది. కానీ ధరలు మాత్రం పెరగడం లేదు. దీంతో రైతులు నిరాశచెందుతున్నారు. ప్రస్తుతం కిలోకు రూ. 6 నుంచి రూ.7 పలుకుతుంది, గత సంవత్సరం కిలో రూ. 15 నుంచి రూ. 18 వరకు ఉండేది. విత్తనం నాటిన నాటి నుంచి ఎరువులు, అంతర కృషి తదితర పెట్టుబడులకు ఎకరానికి రూ. 60 వేల వరకు ఖర్చు అవుతుంది. డిమాండ్ తగ్గడం వల్ల ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పొలంలో వదిలేస్తున్నట్లు కొంత మంది రైతులు వాపోతున్నారు. పక్కనే ఉన్న కర్నాటక, మహారాష్ట్రల నుంచి కూడా ప్రతి రోజు రైతులు పుచ్చకాయలు జహీరాబాద్ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. దీంతో డిమాండ్ తగ్గి రైతులు నష్టపోవాల్సిన దుస్థితి.

ధర నిరాశ కల్గించాయి

రెండు సంవత్సరాల నుంచి పుచ్చకాయల సాగు చేస్తున్నా. గత సంవత్సరం దిగుబడి తగ్గినా ధర గిట్టుబాటు అయింది. దీంతో మంచి లాభాలు వచ్చాయి. ఈ సంవత్సరం పంట దిగుబడి పెరిగిన రేటు లేక నష్టపోవాల్సి వచ్చింది.ఈ సంవత్సరం కిలోగ్రాముకు రూ. 6 ధర పలికింది. పుచ్చకాయ సాగు స్థిరంగా ఉండాలంటే ధర కిలోగ్రాముకు రూ. 15 నుంచి రూ. 18 మధ్య ఉండాలి.
-మారుతి, రైతు,బూచినెల్లి


మార్కెట్‌లో విక్రయిస్తున్న పుచ్చకాయలు

ఓటీఎస్‌తో ఆస్తిపన్ను చెల్లింపు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం సెటిల్మెంట్ పథకంలో బకాయిదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ మేరకు రాసన్ ఎక్స్పోర్ట్ పరిశ్రమ యజమాని రవీందర్ రెడ్డి 30 లక్షల 77 వేల రూపాయల ఆస్తిపన్ను ఓటీఎస్ పథకంలో 15 లక్షల 58 వేల మాఫీ పొంది మిగతా పన్ను చెక్కు రూపంలో మున్సిపల్ అధికారులకు చెల్లించారు. గురువారం రూ.46 లక్షల ఆస్తి పన్నులు వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మున్సిపల్ లక్ష్యం 16 కోట్ల 30 లక్షలకు గాను నేటి వరకు 13 కోట్ల 24 లక్షలు దాదాపు 80 శాతం పన్నులు వసూలు చేసినట్లు తెలిపారు. గడువు తేదీ 31 సమీపిస్తుండటంతో బకాయిదారులు స్పందించాలన్నారు. 30, 31 సెలవు దినాలు కావడంతో 29 వరకు ఆస్తిపన్నులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింలు, వార్డు ఆఫీసర్లు సమీర్, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న యజమాని

మార్పును అందిపుచ్చుకోవాలి

పటాన్‌చెరు: మార్పు అనివార్యమని దానిని అందిపుచ్చుకుని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని బెడ్‌ఎక్స్ వక్తలు సూచించారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో 'టెడ్క్స్ గీతం హైదరాబాద్–2025' ని విజయవంతంగా నిర్వహించారు. విభిన్న రంగాల నుంచి విచ్చేసిన అతిథులు మార్పు గురించి స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకత్వం, విద్య, పాలన, మీడియా, ఆర్థిక శాస్త్రం, భావోద్వేగ మేధస్సుపై లోతైన అవగాహనను కల్పించారు. కేంద్ర మానవవనరుల అభివృద్ధి, రక్షణ శాఖల మాజీమంత్రి ఎం.ఎం.పల్లంరాజు టెడ్ టాక్స్‌ను ప్రారంభిస్తూ, చిన్న వయస్సులోనే పిల్లలను స్వయం సమృద్ధి చేయాలని, పాఠశాల విద్య నాణ్యతను పెంచాలని, నైతిక విలువలు, నీతి, పర్యావరణ స్పృహను పాఠ్యాంశాలలో చేర్చాలని తక్షణ ఆవశ్యకతపై ఆయన ఆకర్షణీయమైన ప్రసంగం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్మలారెడ్డి జన్మదిన వేడుకలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండలంలోని వెల్టూర్‌లో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. భగవంతుడి ఆశీస్సులు, ప్రజల అండదండలతో నియోజకవర్గ అభివృద్ధికి ఆమె అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సిద్ధన్న, నాయకులు పాల్గొన్నారు.


వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి సంజీవన్‌రావుపేట్‌కు చెందిన కృష్ణవేణికి రూ.60వేలు, అంబయ్యకు రూ.31వేలు మంజూరయిు. గురువారం చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. బీఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, ఖేడ్ మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, విఠల్ రావు, సాయిరెడ్డి, భూపాల్ పాల్గొన్నారు. అలాగే, నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన జనాబాయికి రూ.97 వేలు, ప్రభాకర్, రామవ్వకు రూ.60 వేలు, అభిషిత్ రెడ్డికి రూ.59 వేలు, విజయ్‌కుమార్‌కు రూ.33 వేలు, భూలీబాయికి రూ.24 వేలు సీఎం సహాయనిధి చెక్కులను నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్‌లు పంపిణీ చేశారు. ఝరాసంగం బోపన్ పల్లికి చెందిన నర్సప్పకు రూ.2.05 లక్షల మంజూరుకు సంబంధించిన ఎల్‌ఓసీని ఎంపీ సురేష్ కూతురు శివాని అందజేశారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక


రుత్విక్

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామానికి చెందిన విద్యార్థి రుత్విక్‌గౌడ్ వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించినట్లు బ్లూమింగ్ బడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సాయులు తెలిపారు. నవోదయ ఎంపికకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు నవోదయలో అడ్మిషన్ పొందారు.

ఆలయ స్థలం పరిరక్షణకు కృషి

పటాన్‌చెరు టౌన్: గణేష్ గడ్డ దేవస్థాన స్థల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఆలయ ఈఓ లావణ్య తెలిపారు. గురువారం మండలంలోని గణేష్‌గడ్డ దేవాలయానికి చెందిన స్థలాన్ని గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి రూ. 2 వేల చొప్పున, మరో ఆరుగురికి రూ.1500, మరో ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో..

జిన్నారం : గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో గత వారం రోజుల క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఒకరికి జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా విధించినట్లు ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టుపడిన ముగ్గురిని జిల్లా కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ. 2500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ఎల్ఆర్ఎస్ గడువు పెంచండి

నారాయణఖేడ్: ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ గడువు మరో నెల రోజుల పాటు పెంచాలని పీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని లేఔట్ల, ప్లాట్లను క్రమబద్ధీకరించడానికి చేపట్టిందని తెపారు. కార్యక్రమంపై అవగాహన కల్పించడానికే సమయం పట్టిందన్నారు. ఈనెల 31 వరకు చివరి గడువు ఉండటంతో పాటు మూడు రోజులు సెలవులు ఉన్నాయని చెప్పారు. చాలా మంది, పథకాన్ని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అందువల్ల ప్రభుత్వం స్పందించి మరో నెల రోజులు గడువును పెంచాలని డిమాండ్ చేశారు.

◆ ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



జహీరాబాద్ టౌన్: అత్యుత్తమ ప్రదర్శనతో డిపోకు విశిష్ట సేవలు అందించిన ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్, కండక్టర్లకు గురువారం పురస్కారాలు డిపో మేనేజర్ జాకీర్ హుసేన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ ఉద్యోగుల స్ఫూర్తితో మిగిలిన వారు కూడా డిపో అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ అధికంగా వసూలు చేయొద్దు



నారాయణఖేడ్: మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణీత ధరకంటే అధికంగా డబ్బులు వసూలు చేయకూడదని జిల్లా టీఎస్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మీసేవలో నూతనంగా వచ్చిన శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్, రాజీవ్ యువ వికాస్ సేవలపై నారాయణఖేడ్ మీసేవ నిర్వాహకులకు గురువారం అవగాహన కల్పించారు. మీసేవ ద్వారా ప్రజలకు సేవలు మెరుగుపరచడానికి నూతన సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మీసేవలో నూతనంగా శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందుబాటులో వచ్చాయని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ కేంద్రంలో మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు సయ్యద్ షరీఫ్, సుధాకర్, మల్లేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

అస్తిపన్నుపై వడ్డీలో 90 శాతం రాయితీ

మున్సిపల్ కమిషనర్ శ్రీహరి

పటాన్‌చెరు టౌన్: ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం మాఫీ పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, వ్యాపార సంస్థల యజమానులు తమ ఆస్తిపన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ నెల 31లోపు ఆస్తిపన్ను బకాయిలన్నింటిని చెల్లిస్తే బకాయిలపై ఉన్న వడ్డీలో 90 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ కింద ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు.

'డయల్ యువర్ డీఎం'లో 8 విజ్ఞప్తులు

జహీరాబాద్ టౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికుల నుంచి 8 విజ్ఞప్తులు వచ్చాయని జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం ఉ. 11 గంటల నుంచి మ.12 గంటల వరకు ఫోన్ ద్వారా ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరిగినందున బస్సుల సంఖ్య కూడా పెంచాలని, చించోలి రూట్‌లో బస్సు సర్వీస్ నడపాలని, జహీరాబాద్–బీదర్ రూట్‌లో షటిల్ బస్సులను నడపాలని ప్రయాణికులు కోరారని చెప్పారు. నారాయణఖేడ్ రూట్‌లో సాయంత్రం సమయంలో బస్సులు నడపాలని కోరగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భోజిరెడ్డి


అధ్యక్ష, కార్యదర్శులుగా భోజిరెడ్డి, నర్సింహారావు

నారాయణఖేడ్: ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మారుతిరెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా కె.భోజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు, సహాయ కార్యదర్శిగా సంగమేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా సాయిలు, మహిళా ప్రతినిధిగా ప్రమీలపాటిల్, సలహాదారులుగా ఆనంద్ స్వరూప్ షెట్కార్, లక్ష్మన్‌రావు, నర్సారెడ్డి ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మునిపల్లి(అందోల్): సైబర్ నేరాలపై బుదేరా ఎస్ఐ రాజేశ్‌నాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని లింగంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సైబర్ నేరాస్థులు ముఖ్యంగా యువకులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసలు, విద్యార్థులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు


ఠాణాకు తరలించిన మాజీ సర్పంచ్‌లు

నారాయణఖేడ్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు జగదీశ్వరాచారి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పరమేశ్వర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకుండా తమను ఇలా మాటిమాటికి అరెస్టులు చేసి ఠాణాలకు తరలించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో వెంకటేశం, చెన్‌బసప్ప, ప్రభాకర్, సంగప్ప, రవీందర్, సాల్మన్, జైపాల్‌రెడ్డి, నవాబ్ తదితరులు ఉన్నారు. సాయంత్రం సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

టీబెస్ నాయకుల హర్షం

జహీరాబాద్ టౌన్: గోర్‌బోలి భాషను ప్రభుత్వం అధికార భాషగా గుర్తించడంపై తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల సీరాం రాథోడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గోర్‌బోలి భాషను అధికారంగా ప్రకటిస్తూ రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. రూ.15 కోట్లు బంజారాలు మాట్లాడే భాష గోర్‌బోలి అన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రి సేవలు భేష్

నారాయణఖేడ్: ప్రాంతీయ ఆస్పత్రి అన్ని విధాలా చాలా బాగుందని కాయకల్ప బృందం పేర్కొంది. గురువారం బృందంలోని సీఏఎస్ డా.పి.శ్రీకాంత్, నర్సింగ్ అధికారులు శిరీష, జెస్సీఫ్లోరెస్ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర డీఈఓ శ్రీహరి ఆస్పత్రిని సందర్శించారు. రోగుల వార్డులు, ప్రసూతి వార్డు, మందుల నిల్వగది, ఆపరేషన్ థియేటర్లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ఆస్పత్రితో పాటు రికార్డుల నిర్వహణ, సుఖప్రసవాలు, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్లకు సేవలు బాగున్నాయని అన్నారు. అలాగే, ఆస్పత్రికి సంబంధించిన నిబంధనలను విధిగా పాటించడం తదితర విషయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రమేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కాయకల్ప బృందం

నకిలీ ఎరువులు అమ్మితే చర్యలు

ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): రైతులకు నకిలీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని డివిజన్ వ్యవసాయాధికారి నూతన్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని తడ్కల్‌లో సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుగు మందుల ఉత్పత్తి సంస్థ, తయారైన తేదీ, వినియోగించాల్సిన గడువు తదితర వివరాలు పరిశీలించారు. ఎరువుల స్టాక్, రిజిష్టర్లో నమోదు తదితర అంశాలు తనిఖీ చేశారు. ఆయనతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ ఉన్నారు.


రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న నూతన్‌కుమార్

ముస్లిం మహిళలకు దుస్తుల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం పట్టణంలోని గొల్లకేరీలో సంగారెడ్డి జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జావేద్, పట్టణ అధ్యక్షుడు అంతయ్య, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజేశ్‌లు జావేద్ చేతుల మీదుగా పేద ముస్లిం మహిళలకు నూతన దుస్తుల పంపిణీ చేశారు. సోదరభావంతో రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.


దుస్తుల అందజేస్తున్న జావేద్ తదితరులు

ముగిసిన సప్తాహ

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె)లో వారం రోజుల పాటు కొనసాగిన అఖండ హరినామ సప్తాహ గురువారంతో ముగిసింది. చివరిరోజున కేదార్నాథ్ ఆలయ ప్రధానపూజారి శివలింగస్వామి, మహారాష్ట్రలోని పండరీపూర్ రుక్మిణి, పాండురంగ ఆలయానికి సంబంధించిన అంబదాస్ మహరాజ్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి కాకడహారతి నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ అభిషేకం, పూజలు నిర్వహించారు.


సప్తహలో పాల్గొన్న శివలింగస్వామి, నగేష్‌షెట్కార్

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి

మెడికల్ ఆఫీసర్ నాగమణి



కంగ్టి(నారాయణఖేడ్): తీవ్రమైన ఎండలు, వడగాల్పుల నుంచి వ్యవసాయ, ఉపాధి కూలీలతో పాటు పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని కంగ్టి మెడికల్ ఆఫీసర్ బీ. నాగమణి తెలిపారు. ఎండలో పనులు చేసి బీపీ ప్రమాదకర స్థాయిలో పడిపోయిన ముగ్గురు రోగులకు రెండు రోజుల్లో వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఉపాధి కూలీలు ఉ. 6 గంటల నుంచి 10 గంటల లోపు పనులు ముగించుకోవాలన్నారు. వ్యవసాయ పనులు, ఇతర పనుల వారు, పిల్లలు ఎండ తీవ్రత దృష్ట్యా పగటి వేళల్లో ఇంట్లో నుంచి బయటకు రావద్దని సూచించారు. వేసవిలో వాంతులు, విరోచనాలు, అతిగా చమటలు పట్టడంతో నీరసం ఎక్కువై పడిపోయే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారిని చల్లని ప్రదేశానికి తరలించాలన్నారు. బీపీ పరీక్షలు చేసుకోకుండా ఓఆర్ఎస్ తాగడం మంచిది కాదని తెలిపారు. ఎండల తీవ్రతతో 4 ఏళ్లలోపు, 40 ఏళ్లు దాటిన వారికి ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున చల్లని నీరు ఎక్కువగా తాగాలని తెలిపారు. లక్షణాలు కన్పిస్తే వెంటనే 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తరలించాలని సూచించారు.

సీతారాముల విగ్రహాల బహూకరణ

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గోవిందరాజ్ పల్లి గ్రామానికి సీతారామచంద్రస్వామి, లక్ష్మణ వెండి విగ్రహాలను బహూకరించినట్లు గురువారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ తెలిపారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి విజయం సాధించడంతో బీజేపీ నాయకులు చిల్వేర నర్సింలు దంపతులు గోవిందరాజుపల్లికి శ్రీరామనవమి కల్యాణానికి సీతారాముల వెండి విగ్రహాలను బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ హత్నూర మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ ఓబీసీ మోర్చా నాయకులు కృష్ణ, వీరన్న, బూత్ అధ్యక్షుడు మన్నె వెంకటేష్, సురేష్, పెంటరెడ్డి పాల్గొన్నారు.


వెండి విగ్రహాలను బహూకరిస్తున్న నాయకులు

దౌల్తాబాద్ తైబజార్ వేలం

హత్నూర,(సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ తైబజార్ వేలం గురువారం నిర్వహించినట్లు ఎంపీడీఓ శంకర్ తెలిపారు. వేలంపాట నిర్వహించగా రూ.10,60000 లకు చింత ప్రవీణ్‌కుమార్ దక్కించుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఏడాది కాలం పాటు చింతప్రవీణ్‌కు పూర్తి హక్కులు ఉంటాయని తెలిపారు. కార్య క్రమంలో ఎంపీఓ యూసుఫ్ అలీ, గ్రామ కార్యదర్శి స్థానికులు పాల్గొన్నారు.

ఇస్నాపూర్ మున్సిపాలిటీలో..

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇస్నాపూర్ తైబజార్ వేలంను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేలంలో పాతూరు శ్రీనివాస్‌రెడ్డి రూ.ఒక కోటి ఐదు లక్షల 35 వేలకు వేలంలో దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాయిమాధురి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉగాది ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పటాన్‌చెరు: ఉగాదిని పురస్కరించుకొని డివిజన్‌లోని చైతన్యనగర్ హనుమాన్ ఆలయంలో నిర్వహించే పంచాంగ శ్రవణం ఆహ్వాన పత్రికను గురువారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి ఏటా పంచాంగ శ్రవణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, శ్రీరాములు, శీనయ్య, మల్లేష్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ముస్లింలకు ఇఫ్తార్ విందు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజేశ్వర్ రెడ్డి, సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ సభ్యులు బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యలు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఆదర్శ్ రెడ్డి